

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

గురువారం, 8 మే 2025 | 8 పేజీలు

వీర జవానులకు విద్యాధరి సంఘీభావం

విశాలాంధ్ర-పులివెందుల: పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రవాద స్థావరాలపై వీరోచితంగా పోరాడుతున్న వీరజవానులకు స్థానిక విద్యాధరి సీఈవో భానుప్రకాష్, కరస్పాండెంటు నాగరాజు, ప్రిన్సిపల్ జాకీర్‌హుసేన్, ఉపాధ్యాయులు విద్యార్థులు సంఘీభావం తెలిపారు. అందరూ కలిసి వీర జవానులకు సంఘీభావం తెలియజేస్తూ వారికి సెల్యూట్ చేశారు. మన దేశ త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి తమ సంతోషాన్ని నినాదాల రూపంలో వ్యక్తపరిచారు.

2 లో

నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన

మహనీయుడు అల్లూరి

విశాలాంధ్ర-రాయచోటి: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాల వేసి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు 1897 జులై 4న విశాఖపట్నం జిల్లా పాండ్రంగిలో జన్మించారు. బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను పురిగొల్పారు. స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. తనను నమ్ముకున్న ప్రజల కోసం 1924 మే 7న ప్రాణ త్యాగం చేశారు. భౌతికంగా మన మధ్యలేనప్పటికీ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చూపిన తెగువ, పట్టుదల ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) వెంకటాద్రి ఏఆర్ డిఎస్పీ యం.శ్రీనివాసులు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శంకరమల్లయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు పి.రాజారమేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికార లాంచనాలతో పాలకొండ్రాయుడు అంత్యక్రియలు: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు అంత్యక్రియల నిర్వహణ అధికారిక లాంచనాలతో గురువారం ఉదయం 09:00 గంటల నుండి నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగువాసి పాలకొండ్రాయుడు మంగళవారం ఉదయం మరణించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయన అంత్యక్రియలను అధికారిక లాంచనాలతో గురువారం ఉదయం నిర్వహించేందుకు కావలసిన ఏర్పాట్ల కోసం జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఇతర అధికారులకు వివిధ సూచనలను చేసినట్లుగా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వేసవి దుక్కులకు వేళాయె.!

వేసవి అనంతరం వర్షాకాలం రానుంది. ఈ సమయంలో పంటవేసే ముందు వేసవి దుక్కులను దున్నుకోవాలి. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూమిని దున్నటం వల్ల తొలకరి చినుకులు రాగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. లోతు దుక్కుల వల్ల భూమిపై పొరలు కిందికి, కింది పొరలుపైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. దీంతో భూమిలో తేమశాతం పెరిగి, భూసార అభివృద్ధి, పురుగులు, తెగుళ్ల యాజ మాన్యం, కలుపు మొక్కల నివారణ తదితర ప్రయోజనాలు లభిస్తాయి.

విశాలాంధ్ర-పులివెందుల

భూసార వృద్ధి, తేమశాతం పెరుగుదలలో కీలకపాత్ర

వేసవి దుక్కులు లోతుగా, వాలుకు అడ్డంగా దున్నుకోవాలి వాలుకు అడ్డంగా దుసుకోవదం వల్ల వర్షపునీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయి. దీంతోపాటు భూమి ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీని ప్రభావంతో పంట దిగుబడి మీద కేంద్రీకృతమవుతుంది. వేసవి దుక్కులు దున్ని ముందు పొలంలో గొర్రెలను, పశువుల మందలు తోలటంవల్ల అవి విసర్జించే పదార్థం తయారవుతుంది. ఇది భూసార వృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. వేసవి రుక్కులు దున్నే ముందు పశువు వెంట పోగు, కంపోస్టు ఎరువు, చెరువులోని మట్టని వెదజల్లాలి. దీనివల్ల నేలలు సారవంతమై పంట దిగుబడి పెరుగుతుంది. దీంతో పాటు తేమ శాతం పెరుగు తుంది. సాధారణంగా రైతులు పంట చేతికందగానే పంటల నుంచి వచ్చే ఎండు ఆకులు, చెత్త, చెదారం కాల్చివేయవద్దు. అవకాశం ఉంటే లోతు దుక్కులు దున్నడం వల్ల చెత్త.. చెదారం, ఎండు ఆకులు నేల పొరల్లో కలిసిపోతాయి. ఇవి ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది.



పురుగులు, తెగుళ్ల నివారణ

సీజన్‌కు ముందుగానే వేసవి దుక్కులను తయారు చేసుకోవాలి. దీనివల్ల రైతు లకు అనేక ప్రయోజ నాలు కలుగుతాయి. ముఖ్యంగా భూమిలో తేమ శాతం పెరుగుతుంది అలాగే భూసారం పెరుగుతుంది.

2 లో

ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించండి: కలెక్టర్

- సివిల్ మాక్ డ్రిల్‌లో భాగంగా జూమ్ కాన్ఫరెన్స్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: దేశంలో పౌర రక్షణ చర్యలను బలోపేతం చేసే దిశగా.. జిల్లాలో ముందస్తుగా భద్రతపై మరింత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి పోలీసు, రెవెన్యూ, భద్రతా, అత్యవసర సేవా, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం సివిల్ మాక్ డ్రిల్ అంశంపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. కేంద్ర హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన సివిల్ డిఫెన్స్ రూల్స్ ప్రకారం జిల్లాలో పౌర రక్షణకై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఆ మేరకు జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, ఫైర్, మెడికల్, మొదలైన ఎమర్జెన్సీ సర్వీసులు, ఇతర అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రత్యేకించి జిల్లాలోని జీజీహెచ్, ఏరియా, జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ లతో సమన్వయం చేసుకుని అన్ని రకాల అత్యవసర చికిత్సలు, మందులను, అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచుకోవాలని డిఎంహెచ్‌ఓను ఆదేశించారు. ప్రధానంగా జిల్లాలో ఉన్న విద్యుత్,

2 లో

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



విశాలాంధ్ర-రాయచోటి: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగా వారి అభివృద్ధికి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ వారి సహకారంతో 150మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.50లక్షల విలువైన కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా కలెక్టర్, జేసి ఆదర్శ్ రాజేంద్రన్ విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్ళను పంపిణీ చేశారు. జిల్లాలోని 150మంది కాళ్లు కోల్పోయిన విభిన్న ప్రతిభావంతులకు సంబంధించి ఈ ఏడాది మార్చి మొదటి వారంలో కృత్రిమ కాళ్ళ కొరకు కొలతలు తీసుకోవడం జరిగిందన్నారు. అతి తక్కువ కాలంలోనే వీరందరికీ చెన్నైకి చెందిన యాక్సిస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ ఆర్థిక సహకారంతో నేడు రూ.50 లక్షలు విలువైన ఆధునిక కృత్రిమ కాళ్ళు అమర్చడం జరిగిందన్నారు. ఇందుకు కృషి చేసిన విభిన్న ప్రతిభావంతుల శాఖ, చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు.

2 లో

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: ఆన్‌లైన్ ద్వారా డబ్బు మోసాలు, షాపింగ్ మోసాలు, పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్టులు వంటి మోసాలపై అవగాహన కలిగి ఉండాలని 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్యనారాయణ మూర్తి అన్నారు. తెలుగు గంగ కాలనీలో నిర్వహిస్తున్న ఎన్.సి.సి కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా కడప నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఇందులో భాగంగా నాగరాజు మాట్లాడుతూ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ మరియు టిక్‌టాక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా జరిగే మోసాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అంతేకాకుండా తమ కుటుంబ సభ్యులకు, చుట్టుపక్కల నివాసముండే ప్రజలందరికీ సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని అన్నారు. మహిళ ఇన్స్పెక్టర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ పాల్పడిన విద్యార్థులకు కఠినమైన చట్టాలు వర్తిస్తాయని తద్వారా విలువైన జీవితం కోల్పోతారని అన్నారు. అంతేకాకుండా క్యాడెట్లు ఎటువంటి ఆకర్షణలకు లోను కాకుండా విలువైన బాల్యాన్ని చదువు కోసం వెచ్చించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్.జే. ఆత్రే, ఎన్.సి.సి అధికారులు కెప్టెన్. డాక్టర్. నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్ పరేడ్ శిక్షణ అధికారులు సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, రూపేంద్ర జిత్ సింగ్, సీ.ఎల్. రెడ్డి, కొండా రెడ్డి , గర్ల్ క్యాడెట్ ఇన్స్ట్రక్టర్ మిశ్రా ఆఫీస్ సిబ్బంది సూపరిండెంట్ డేవిడ్, ఉమా, మల్లేశ్వరి, శివప్రసాద్, రాజగోపాల్ రెడ్డి, ఎన్.సి.సి సీనియర్ క్యాడెట్లు మల్లికార్జున్, ఆనంది మొదలగువారు పాల్గొన్నారు.

104 వైద్యసేవలపై అవగాహన

విశాలాంధ్ర-తొండూరు: తొండూరు మండలం మల్లెల గ్రామంలో బుధవారం 104వైద్య సేవలపై డాక్టర్ రేష్మా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రోగులకు పరీక్షలు నిర్వహించారు.అలాగే దీర్ఘకాలిక వ్యాదులైన రక్తపోటు, మధుమేహం వ్యాధులకు పరీక్షలునెలకు సరిపడు మందులు అందజేశారు. నడువలేక మంచానికే పరిమితమైన వారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించినట్లు రేష్మా తెలిపారు. డాక్టర్ మాట్లాడుతూ ఎండలకు ఉష్ణోగ్రత అధికంగా ఉండుట వలన ప్రజలు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండకు తిరుగా రాదన్నారు. అత్యవసరమైన నేపథ్యంలో గొడుగు, టోపీ, తలగుడ్డ ఉపయోగిం చాలన్నారు. నీటిని ఎక్కువ వాడాలని ద్రావణము వాడాలన్నారు. మాంసం, మద్యం, మసాలాలు తగ్గించాలని తెలిపారు. సచివాలయం ఏఎన్ఎమ్ వరలక్ష్మి, 104సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వసతిగృహానికి నీటిశుద్ధి కేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-తొండూరు: తొండూరు ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహమునకు తుషారికా సిన్హా రూ.50వేలు ఖర్చుతో నీటిశుద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి భరత్ కుమార్ రెడ్డి బుధవారం వసతిగృహాన్ని సందర్శించిన సమయంలో విద్యార్థులు త్రాగు నీటి సమస్యతో ఇబ్బందులు ఉన్నాయని గుర్తించారు. విద్యార్థుల దాహార్తిని దృష్టిలో ఉంచుకుని సామాజిక సేవ చేయాలన్న సంకల్పంతో తుషారికా సిన్హా త్రాగు నీటిశుద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు. దాహార్తికి సహకరించిన తుషారికా సిన్హా దాతృత్వాన్ని పలువురు అభినందించారు. కార్యక్రమంలో పులివెందుల డివిజన్ సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నాగేంద్రరాజు, వసతిగృహ సంక్షేమ అధికారి యస్.ఉమర్ ఫరూక్, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

అలజడులు సృష్టించే మెసేజ్ లు ఫార్వర్డ్ చేస్తే కఠిన చర్యలు: ఎస్పీ

విశాలాంధ్ర-రాయచోటి: పాకిస్తాన్ పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఉద్వేషపూరితమైన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా షేర్ చేసిన, పోస్ట్ చేసిన ఆడియో, వీడియో మెసేజ్ ల రూపంలో గ్రూపుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించిన అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. ప్రతి సామాజిక మాధ్యమాల గ్రూపులను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా పోలీసులు, సైబర్ సెల్ పోలీసులతో నిఘా ఉంచామని. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దని కోరారు. అలా కాకుండా పోలీస్ వారి ఆదేశాలను మీరి అవాస్తవమైన, విద్వేషపూ రితమైన మెసేజ్లను, ఆడియో, వీడియోలను షేర్ చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి ఏమాత్రం వెనకాడమని హెచ్చరించారు.

సాధు సత్రాన్ని దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని సాదు సత్రంను స్వాధీన పరు చుకోవాలని జిల్లా దేవాదాయ శాఖ కార్యాల యంలో సీనియర్ అసిస్టెంట్‌కి ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవై ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెద్దుల్లపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ స్థానిక బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు విడిది కోసం చందాలు వేసుకొని మరీ ఏర్పాటుచేసిన సాధు సత్రాన్ని వరుణ్ స్కూలు యాజమాన్యం 1997 సంవత్సరం నుండి అక్రమంగా లీజుకు తీసుకొని ఆక్ర మించుకొని దాదాపు 25 సంవత్సరాలుగా లీజు డబ్బులు చెల్లించకుండా స్కూలు నడుపుతూ, పైగా ఆ స్థలంలోనే అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న స్కూలు యాజమాన్యం పై దేవాదాయ శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. స్కూలు యాజమాన్యం టిడిపి, వైసీపీ రెండు రాజకీయ పార్టీలతో సంబంధాలు పెట్టుకుని అక్రమనే ద్యేయంగా సత్రం ముందుభాగాన నిర్మాణాలు చేస్తున్న దేవాదాయ శాఖ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ గారు నోరు మెదపకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. సిట్ పర్సన్ శంకర్ బాలాజీ బ్రహ్మంగారిమఠం వచ్చి 2 సంవత్సరాల పై బడిన ఇంతవరకు కనీసం స్పందించకపోవడం దురదృష్టకం మన్నారు. ఈ సాధు సత్రం అక్రమ లీజు మరియు నిర్మాణాల పైన శంకర్ బాలాజీ గారికి ఎంతమేరకు ముడుపులు అందినయో విచారణ చేసి అదే విధంగా సాధుసత్రాన్ని దేవాదాయ శాఖ వారు స్వాధీనం చేసుకొని ప్రజలు, భక్తులు, సాధువులు సౌకర్యార్థం వినియోగించాలని వారు అసిస్టెంట్ కమిషనర్ గారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యులు శివతేజ, అరుణ్, నాగార్జున పాల్గొన్నారు.

వేసవి దుక్కులకు వేళాయె

మొదటి పేజీ తరువాయి

పురుగులు, తెగుళ్ళ నివారణకు వేసవి దుక్కులు ఉపయోగకరంగా ఉంటాయి. అన్నింటికంటే ముఖ్యమైనది. కలుపు నివారణ ముందస్తుగానే దుక్కులను దున్నుకోవడం వల్ల కూలీల ఖర్చును తగ్గించుకోవచ్చు. తద్వారా పెట్టుబడి భారం తగ్గుతుంది. ఎండాకాలంలో భూమి ఖాళీగా ఉంటుంది. ఈ సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగులు పంటకోత దశల్లో వాటి నిద్రావస్థ దశలను నేలలో, చెత్తాచెదారంలో గడుపుతాయి తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు తదితర భూమిలోపల ఆశ్రయం పొందుతాయి. లోతు దుక్కుల వల్ల నిద్రావస్త దశలో భూమిలో ఉన్న చీడ పురుగుల కోశాలు గుర్తు, లార్వాలు, గుడ్లను పక్షులు, కొంగలు, కాకులు, తిని నాశనం చేస్తాయి. అదే విధంగా వేసవి దుక్కల వల్ల భూమిలోపల పొరల్లో ఉన్న శిలీంద్ర బీజాలు మట్టితో పాటు నేలపైకి వస్తాయి. ఇది అధిక ఉష్ణోగ్రతకు గురై వ్యాధి కలుగజేసే శక్తిని కోల్పోతాయి.

వేసవి దుక్కులతో కలుపు నిర్మూలన

వేసవి దుక్కులను తయారుచేసుకోకపోతే కలుపు నివారణకు అదనపు భారం పడుతుంది. పంటలేని సమయంలో కలుపు మొక్కలు పెరుగుతాయి. ఈ మొక్కలు నేలలోని నీరు, పోష కాలను గ్రహించి పంట దిగుబడిని తగ్గిస్తాయి. అలాగే అనేక రకాల పురుగులకు, శిలీంధ్రాలకు ఆశ్రయాన్ని కల్పించలం ద్వారా పరోక్షంగా పంట నష్టానికి కారణమవుతాయి. కాబట్టి వేసవి లోతుదుక్కుల వల్ల లోతుకు పాతుకుపోయిన కలుపు మొక్కలు వాటి విత్తనాలు నేలపై పొదల్లోకి చేరటం వల్ల అధిక ఉష్ణోగ్రతకు గురై నశిస్తాయి. దీనివల్ల తదుపరి పంటలో కలుపుతాకిడి తక్కువగా ఉంటుంది. రైతుకు కూలీల ఖర్చులు కూడా తగ్గే అవకాశం ఉంటుంది.

వీర జవానులకు విద్యార్థుల సంఘీభావం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా భారత్ మాతాకు జై వందేమాతరం, జైజవాన్ వంటి నినాదాలతో విద్యార్థులు ఉపాధ్యాయులు హోరెత్తించారు ప్రతి ఒక్కరూ ప్రస్తుత సందర్భంలో మన భారత దేశ సైనికులకు అండగా నిలిచి వారిలో మనోధైర్యం ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా ప్రవర్తించాలని దేశానికి ప్రభుత్వానికి విధేయులుగా ఉండాలని సీఈవో భాను ప్రకాష్ కోరారు.

ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించండి: కలెక్టర్

మొదటి పేజీ తరువాయి

ఇంధన, అణు ఉత్పాదక సంస్థలు, కర్మాగారాలైన ఆర్టిపిపి, పవర్ గ్రిడ్, ఐఒసీఎల్, హెచ్పిసీఎల్, యూసీఐఎల్ తదితర సంస్థల్లో ఖచ్చితంగా పౌర భద్రతా ముందస్తు చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని జిలా కలెక్టర్ ఆదేశించారు. మాక్ డ్రిల్ నిర్వహించిన అనంతరం సంబందిత రిపోర్ధులను కలెక్టరేట్‌కు అందజేయలన్నారు. అలాగే అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు వారి పరిధిలోని మండలాల్లో ని సంబంధిత అధికారులతో కలసి పౌర రక్షణ ముందస్తు చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. అందులో భాగంగా చేపట్టే రిహార్సల్స్, మాక్ డ్రిల్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా పోలీసు శాఖ కార్యాలయం నుండి ఎస్పీ అశోక్ కుమార్, కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జేసీ అదితిసింగ్, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

మొదటి పేజీ తరువాయి

అనంతరం చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ సుందర్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ తరఫున ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉండటం గర్వంగా ఉంది. మరిన్ని సహాయ కార్యక్రమాలకు తాము సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్.వి.క్రిష్ణ కిషోర్, వారి సిబ్బంది, చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ ప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతులు తదితరులు పాల్గొన్నారు.

పహల్గామ్ ఉగ్రదాడికి పాకిస్థాన్‌పై భారత్ ప్రతీకారం తీర్చుకుంది

విశాలాంధ్ర-పులివెందుల: పహల్గామ్ ఉగ్ర దాడికి శత్రుదేశం పాకిస్థాన్‌పై భారత్ ప్రతీ కారం తీర్చుకుందని వైస్సార్సీపీ విద్యార్థి విభా గం అధ్యక్షులు పోరెడ్డి జస్వంత్ రెడ్డి. వైస్సా ర్సీపీ బీసీ సెల్ అధ్యక్షులు కార్తీక్. వైస్సార్సీపీ ఆర్టిఐ అధ్యక్షులు మారుతీ రెడ్డి. కౌన్సిలర్ పద్మనాభ రెడ్డి వైయస్సార్సీపీ నాయకులు సాయి భరత్ రెడ్డి, రంగాలు తెలిపారు. వారు మాట్లాడుతూ దాయాదిపై భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో చేపట్టిన ఈ సైనిక చర్యలో ఎయిర్ ఫోర్స్, నేవీ బలగాలు పాల్గొన్నాయన్నారు. ఈ దాడి అనంతరం ఇరు దేశాల మధ్య పరిస్థితి మరింత దిగజారిందన్నారు.. దీంతో సైన్యం సరిహద్దుల్లో అప్రమత్తమైందని తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడితో యావత్తు దేశం రగిలిపోయిందన్నారు. పాకిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని ప్రతి భారతీయుడు కోరుకున్నాడని, అందుకు అనుగుణంగా అన్ని అంశాలను కూలంకుషంగా చర్చించి.. రెండు వారాల అనంతరం ఉగ్రవాద స్థావరాలపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారత సైన్యం మెరుపుదాడి చేసింది. 23 నిమిషాల్లో ఆపరేషన్ విజయవంతగా ముగించి వెనక్కు రావడం శుభపరిణామన్నారు.

సర్పంచ్ చొరవతో పైప్ లైన్‌కు మరమ్మత్తులు

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి గండి రోడ్డు నందు పైప్ లైన్ చింతలమడుగు క్రాస్ వద్ద పగిలిపోయి మంచి నీటిలో మురికి నీరు చేరుతున్నాయి దాని మరమ్మతులు చేయాలి అని వార్డు మెంబర్ సునీల్ సర్పంచ్ శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన పులివెందుల నుంచి కంప్రెసర్లు తెప్పించి పైప్ లైన్ బాగు చేశారు. త్వరగా స్పందించినందుకు గండి రోడ్డు ప్రజలు సర్పంచ్‌ను అభినందించారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి: సుగవాసి

- కువైట్ ఎన్నారై టిడిపి ఆధ్వర్యంలో ఘన నివాళులు

విశాలాంధ్ర-రాజంపేట: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా రాజంపేట, రాయచోటి నియోజకవర్గాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న ప్రజా నాయకుడు రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు అని సుండుపల్లి మండలంలోని ముడంపాడు కందుల వాళ్ళ పల్లికి చెందిన కువైట్ ఎన్నారై టిడిపి యువ నాయకులు కంచన రెడ్డి శేఖర్ అన్నారు. బుధవారం కువైట్ నగరంలోని హవల్లి ప్రాంతంలో ఆయన మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ సుగవాసి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో ఓటమి ఎరగని మహోన్నత నాయకుడు సుగవాసి అన్నారు. దివంగత సీనియర్ ఎన్టీఆర్ స్ఫూర్తితో మచ్చ లేని నాయకుడిగా ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రాజంపేట, రాయచోటి నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రత్యేక బాటలు వేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికే పెద్దపీట వేశారన్నారు. అంతేకాకుండా సుగవాసి పాలకొండ్రాయుడు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అన్నారు. పసుపు జెండాను చేతపట్టి రాయచోటిలో చరిత్ర తెలుగు రాసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అటువంటి మహానాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరం అన్నారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తూ.. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై టిడిపి నాయకులు కంచన రెడ్డి శేఖర్, సహదేవా, నాగేష్, సాయిబాబా, బలిజపల్లి సేవ సంఘం అధ్యక్షులు రాజా, కొండమర్రి శ్రీహరినాయుడు, గొల్ల గురుమూర్తి నాయుడు, నాగరాజ, మల్లికార్జున, బలరాం, మధుసూదన్, సైద్ వసి, సుబ్బ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పి.వెంకట సురేష్

విశాలాంధ్ర- పోరుమామిళ్ల రూరల్: కడప జిల్లా బి కోడూరు మండలం లోని సబ్ ఇన్స్పెక్టర్‌గా పి.వెంకట సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేను ఇంతకుముందు పొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై బి.కోడూరు మండలానికి బదిలీ అయ్యి వచ్చాను అన్నారు. ముందుగా మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ బి కోడూరు మండలానికి నూతనంగా ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నానని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటానని. మండలంలో ఏమైనా సంఘటనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలను కోరారు. అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

మెరుగైన సేవల కోసమే రైతు ఉత్పత్తి దారుల సంఘాలు

- ఆంధ్రప్రదేశ్ టెరి సంస్థ ఇంచార్జ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-గాలివీడు: వ్యవసాయంలో మెరుగైన సేవలు అందించి,రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా రైతు ఉత్పత్తి దారుల సంఘాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ టెరి సంస్థ ఇంచార్జ్ కోటేశ్వరరావు అన్నారు.బుధవారం మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామంలో నాబార్డు నాఫెడ్ కేంద్రప్రభుత్వం మరియు ప్రాంత రైతుల భాగస్వామ్యంతో టెరి సంస్థ ప్రోత్సాహంతో రైతు ఉత్పత్తి దారుల సంఘం కార్యాలయాన్ని సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంఘంలో 10మంది రైతులు డైరెక్టర్లుగా వుంటూ, రూ.1000 రుసుము చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారు సభ్యులుగా కొనసాగుతారన్నారు. సమకూరిన మూలాధనానికి కేంద్రప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసి రైతులకు సబ్సిడీ ధరలతో అన్ని రకాల ఎరువులు, మందులు, మౌళిక సదుపాయాలు కల్పించి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కోఆర్డినేటర్ వెంకటరమణ, గ్రామ సర్పంచ్ నారే మల్లికార్జున నాయుడు, కార్యాలయ సిబ్బంది సీఈవో శారద,వెంకట మహేష్ కుమార్, బీఓడీ సభ్యులు నగశేఖర్ నాయుడు, చిన్నరెడ్డప్ప నాయుడు, మల్లికార్జున నాయుడు, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విప్లవ జ్యోతి మన అల్లూరి: డాక్టర్ తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: భారత స్వాతంత్ర్య సంగ్రామం లో తెలుగు ప్రజలు గర్వించ దగ్గ విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి కొనియాడారు. స్వర్గీయ అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు వేంపల్లి లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ మన్యం ప్రజల విముక్తి కోసం, వారి ఆర్థిక, సాంఘిక సముద్ధరణ కోసం తన సుఖాలను త్యాగం చేసి ఆత్మ బలి దానం చేసిన అమరజీవి అని కీర్తించారు.

రవీంద్రుడు విశ్వ కవీంద్రుడు

నోబెల్ పురస్కార గ్రహీత, గీతాంజలి రచయిత, స్వర్గీయ రవీంద్ర నాథ్ ఠాగూర్ విశ్వ కవీంద్రుడు,సాహితీ సార్వ భౌముడు ,కళామతల్లి ముద్దు బిడ్డ అని తులసి రెడ్డి శ్లాఘించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ 164వ జయంతిని వేంపల్లిలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ రవీంద్రుడు వ్రాసిన జాతీయ గీతం జనగణమన జాతీయ స్ఫూర్తికి, దేశ భక్తికి ప్రతీక అన్నారు. తన సాహితీ విలువలతో భారత దేశానికి ప్రపంచంలోనే సమున్నత స్థానం కల్పించారు. ఆయన స్థాపించిన శాంతి నికేతన్ ఆదర్శ గురుకుల విద్యాలయమన్నారు. స్వర్గీయ ఇందిరా గాంధీ శాంతి నికేతన్ విద్యార్థి అని తులసి రెడ్డి గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, నాగ రాజు,రమణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు

విశాలాంధ్ర-చెన్నూరు: చెన్నూరు శివాలయం నందు నిర్మించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయం నందు అద్దంకి విశ్వనాథ్ వారి ఆధ్వర్యంలో స్వామి వారి ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం ప్రత్యేక పూజలను నిర్వహించి అనంతరం మధ్యాహ్నం రెండు వేలకు పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తదుపరి సాయంత్రం గ్రామము నందు ఘనంగా ఊరేగింపు ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొన్నారు.

నాగేశ్వరమ్మ కృషి అభినందనీయం: మంత్రి బాల వీరాంజనేయులు

విశాఆంధ్ర-వేంపల్లి: పదోతరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో పులివెందులకు చెందిన ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన హాస్టల్ వార్డెన్ నాగేశ్వరమ్మ కృషి అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలా వీరాంజనేయ స్వామి, కమీషనర్ లావణ్యలు పేర్కొన్నారు. బుధవారం అమరావతిలోని తుమ్మలపల్లె కళా క్షేత్రంలో పదోతరగతిలో జిల్లాలోనే మంచి మార్కులు సాధించిన ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం విద్యార్థిని బిందుతను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలా వీరాంజనేయ స్వామి, కమీషనర్ లావణ్యలు ఘనంగా సత్కరించి ప్రశంస పత్రాన్ని, షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అనేక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు చెప్పారు. పదవ తరగతిలో అందరూ గర్వించ దగ్గటట్లు ఫలితాలు పులివెందుల ఎస్సీ హాస్టల్ విద్యార్థులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పుస్తకాలతో పాటు అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతమ్మ, ఏఎస్ డబ్బూ రామాంజనేయులు, హాస్టల్ వార్డెన్ నాగేశ్వరమ్మను మంత్రి, కమీషనర్ అభినందించారు.

రాయచోటి అంటేనే.. పాలకొండ్రాయుడు!

- పిసిసి రాష్ట్ర అధికార ప్రతి నిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి

విశాలాంధ్ర- రాయచోటి రూరల్: "జాతస్య హి ధ్రువోమృత్యు ధ్రువం జన్మ మృతస్యహ చతస్మా ద పరి హార్యేర్థే నత్వం శోచితు మర్హసి" అంటే పుట్టిన వాడు మరణించక తప్పదు. మరణించిన వాడు పుట్టకా తప్పదు. ఈ విషయం గురించి శోకించడము తగదు అని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో అర్జునునికి బోధించిన ధర్మసూత్రమును మాజీ రాజ్యసభ సభ్యుడు, పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి వినిపించారు. బుధవారం ఆయన కాంగ్రెస్ పార్టీ నేతలు పిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్, మదనపల్లె నియోజకవర్గం నాయకుడు షేక్ రెడ్డి సాహెబ్, డిసిసి ఉపాధ్యక్షులు రాయచోటి చెన్న కృష్ణ, ఖాదర్ బాష (ఖదీర్), సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ డెలికేట్ మహమ్మద్ గౌస్ లతో కలిసి తులసి రెడ్డి పట్టణంలోని ప్రీతం రెసిడెన్సి ప్రాంగణంలో ఉన్న సుగవాసి పాలకొండ్రా యుడు పార్థివ దేహానికి సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తాజ్ మహల్ అంటే ఆగ్ర, ఆగ్రా అంటే తాజ్ మహల్ ఏ విధంగా గుర్తుకొస్తాయో అదే విధంగా రాయచోటి అంటే పాలకొండ్రాయుడు. పాలకొండ్రాయుడు అంటే రాయచోటి గుర్తుకు వస్తుందని చెప్పారు. సువాసి పాలకొండ్రాయుడు 1978లో రాజకీయ రంగ ప్రవేశం చేసి రాయచోటి నియోజకవర్గం నుంచి జనతా పార్టీ తరపున అభ్యర్థిగా తన సమీప అభ్యర్థి పై 2,685 ఓట్ల మెజార్టీతో గెలుపొందారని తులసి రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. 1984లో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప అభ్యర్థిపై ఎంపీగా విజయం సాధించి తనంటే ఏమిటో అప్పట్లోనే పాలకొండ్రాయుడు నిరూపించుకున్నాడని ఆయన తెలిపారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీగా జిల్లాలోనే కాదు రాష్ట్రంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందిన వ్యక్తి పాలకొండ్రాయుడు అని ఆయన కొనియాడారు. ఎంపీగా ఢిల్లీ పార్లమెంటులో ఉన్న, ఎమ్మెల్యేగా హైదరాబాద్ అసెంబ్లీలో ఉన్న ఆయన రాయచోటి గురించే ఆలోచించే వారిని, ప్రత్యక్షంగా పరోక్షంగా రాయచోటి నియోజకవర్గాన్ని ఆయన ప్రభావితం చేశారని చెప్పారు. పాలకొండ్రాయుడు తన కార్యకర్తలపై ఈగ వాలకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కార్యకర్తల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ రాజకీయాలు చేశారని ఆయన గుర్తు చేశారు. పాలకొండ్రాయుడు భౌతికంగా మన దగ్గర నుంచి దూరమైనప్పటికీ ఆయన జ్ఞాపకాలు నిరంతరం మన చుట్టూతిరుగుతుంటాయన్నారు. నివాళులర్పించిన వారిలో డిసిసి మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అలీ,రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు రఫీ, డిసిసి జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అలీ,మదనపల్లె పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షేక్ మహబూబ్ పీర్, మహమ్మద్ అలీ తదితరులు ఉన్నారు.

మహాభారత యజ్ఞంలో ఘనంగా ద్రౌపదీ కళ్యాణం

విశాలాంధ్ర-రామాపురం: స్థానిక హరిహరాలయం సమీపంలో మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం ద్రౌపతి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. మహాభారత యజ్ఞ౦ లో హరికథ కథానాయకుని గీత వాణి ద్రౌపతి కళ్యాణం అంగరంగ వైభవంగా హరికథ రూపంలో నిర్వహించారు. ద్రౌపతి మాత తరపున మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ రెడ్డి. పాండవుల తరపున నేర్పుపల్లి వెంకటరామిరెడ్డిలు ఇరువైపులా వేద పండితుల మంత్రస్వాల నడుమ కళ్యాణం భక్తుల సమక్షంలో నిర్వహించారు. కళ్యాణ్ వేదిక వద్దకు ద్రౌపతి మాత పాండవ మూర్తులను చక్కగా అలంకరించుకొని బాన సంచారాలతో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకువచ్చారు. కళ్యాణమును తిల కించ దానికి పలు ప్రాంతాల నుంచి మహిళలు ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

వైదిక సిబ్బంది నియామకానికి ఆమోదం అభినందనీయం

విశాలాంధ్ర-వేంపల్లి: రాష్ట్రము లోని దేవాలయాలలో వైదిక సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలపడం అభినందనీయమని బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు రఘునాథ్ రావు ప్రసాదరావులు ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ దేవాదాయ శాఖలో ఉద్యోగాల భర్తీకి ఆమోదం ఇవ్వడం హర్షనీయమన్నారు. గత 5సంవత్సరాల నుండి నియామకాలు లేక దేవదాయ శాఖలో పర్యవేక్షణ లేకుండా పోయిందని దీనివల్ల అవినీతి పెరిగిందన్నారు. వైదిక సిబ్బంది కొరతతో రెగ్యులర్ పూజలు చాలా చోట్ల అరకొర గా జరుగుతున్నాయని ఇప్పుడు సిబ్బంది నియమిస్తే సమస్యలు తీరుతాయన్నారు. భక్తులకు ఇబ్బందులు ఉండవని తెలిపారు. 16 ప్రముఖ ఆలయాలలో నిత్యాన్నదానం పథకం అమలు చేయాలని ఆదేశించడం హర్ష నీయమని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించడం శుభ సూచకమన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతితో పాటు దేవాలయాలు అభివృద్ధి చెందాలని రాష్ట్రము టూరిజం కేంద్రంగా మారితే రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని వారు తెలిపారు.

ఘనంగా వాసవి జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-రామాపురం: మండలంలోని నీలకంఠంపేటలో బుధవారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు భక్తి సాంప్రదాయపద్ధంగా ఘనంగా నిర్వహించారు. నీలకంఠరావుపేట అమ్మవారి శాలలో ఈ వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, మహా గణపతి పూజ పంచామృత, అభిషేకాలు, నవగ్రహ పూజలు, కుంకుమార్చనలు పూజలు మహా మంగళహారతి తీర్థ ప్రసాదాలు అలంకారాలు నిర్వహించారు.

సుగవాసి మృతి పట్ల మాచినేని, కస్తూరి సంతాపం

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ రాజంపేట పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ రాయుడు(82) పార్థివదేహంపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాధ నాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు పూలమాలవేసి నివాళులు అర్పించారు.సుగవాసి మృతికి సంతాపం వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రెండు నిమిషాలు మౌనం పాటించి పాలకొండ రాయుడు సేవలను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విషాద సమయంలో అ కుటుంబానికి భగవంతుడు ఆదరణ, ధైర్యాన్ని ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. తెలుగుదేశంపార్టీ నాయకులు ముక్కర శంకరయ్య, మద్దిన సుబ్బరాఘవులు నాయుడు, తులసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-పెద్దమండ్యం: మండలంలో రామనాయక్ తండా పంచాయతిలో గ్రామ సమస్యలు అందలంలో పర్యటన కు వచ్చిన జిల ఏదయచ్చుడు సాయి లోకేష్ కు గ్రామ సమస్యలను అర్జీ రూపంలో అంద చేశారు. గ్రామంలో త్రాగు నీటి కోసం పైపు లైను పూర్తిగా దెబ్బ తినడం తో సుమారు 3500 మీటర్ లు ఉండడం తో దాని పరిస్కారం కోసం అర్జీ అంద చేశారు. మరు ముఅల గ్రామాలు, గిరిజన ప్రాంతాలు అభి వృధి చెంద దానికి సెల్ టవర్‌లు లేవని గ్రామంలో సెల్ సిగ్నల్ వచ్చే విధంగా గిరిజన గ్రామాలు అభి వృధి చెంద డ్డానికి కృషి చేయాలని గ్రామస్థులు కోరారు ఈ కార్యక్రమంలో బిజీ పి మండల అధ్యచ్చుడు లక్ష్మి నారాయణ మల్లే నాయక్ చాపల రమణ శివశంకర నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ్రాయుడు మృతి రాష్ట్రానికి, పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు మృతిచెందడం పార్టీకి తీరని లోటని జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లు పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని దివంగత మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు భౌతిక కాయానికి మంత్రులు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ సుగవాసి పాలకొండ్రాయుడు మృతి చెందడంతో రాష్ట్రం ఒక గొప్ప నాయకున్ని కోల్పోయిందన్నారు. వారి మరణం రాష్ట్రానికి టిడిపికి తీరని లోటని సుగువాసి పాలకొండ్రాయుడు గత నాలుగు శతాబ్దాలుగా తన రాజకీయ జీవితం ప్రజలకు అంకితం చేసి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన ఒక గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన మరణం చాలా బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. రాష్ట్ర టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ సుగవాసి పాలకొండ్రాయుడు ఎంపీగా, ఎమ్మెల్యేగా పార్టీకి అనేక సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ఆయన మృతి చెందడం చాలా బాధాకరమని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నానన్నారు. భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు పాలకొండ్రాయుడు భౌతిక కాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించడం జరిగిందన్నారు. అనంతరం రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సుగవాసి పాలకొండ్రాయుడు మరణం రాష్ట్రానికే కాదు టిడిపికి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నానన్నారు. సుగువాసి పాలకొండ్రాయుడు గతంలో బీసీల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేయడం జరిగిందన్నారు. ఆయన మరణించినప్పటికీ ఎల్లవేళలా మా గుండెల్లో ఉంటారన్నారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా టిడిపి పార్టీ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు టిడిపి ఇన్చార్జి చల్లా బాబు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి

- అద్దేపల్లి ప్రతాపరాజు

విశాలాంధ్ర-రాజంపేట: భారత స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా రాజంపేట రోడ్లు భవనాల అతిథి గృహం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రాజు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారి తుపాకులకు ఎదురొడ్డి నిలిచిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. మన్యం ప్రజల సమస్యలపై అహోరాత్రులు పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఈ పోరాటంలో ఆయన వీరమరణం పొందారని అన్నారు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్రం కోసం 27 ఏళ్ల చిన్న వయసులోనే పోరాడి ప్రాణ త్యాగం చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, రాజంపేట పార్లమెంటరీ జిల్లా తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, రాజంపేట పట్టణ పార్టీ అధ్యక్షుడు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్, మాజీ కౌన్సిలర్లు గుగ్గిళ్ళ చంద్రమౌళి, మనుబోలు వెంకటేష్, రమణ రాజు, పెంచలరావు, మందపల్లి శ్రీనివాసులు, చేరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు

- పోతు గుంట రమేష్ నాయుడు, సాయి లోకేష్

విశాలాంధ్ర-రాజంపేట: మన్యం విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతుగుంట రమేష్‌నాయుడు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్‌లు అన్నారు. బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా రాజంపేటలోని ఆర్ అండ్ బి బంగ్లా దగ్గర ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి బిజెపి ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయుధ పోరాటయోధుడు, మన్యం విప్లవ వీరుడు స్వతంత్ర సమరయోధులు పరాయి పాలనను అడుగడుగునా ధిక్కరించి భారతీయులు ఎవరికీ బానిసలు కారని గర్జించిన తెలుగు కిశోరం అల్లూరి సీతారామరాజు అని అన్నారు. మన్నెం జనం కోసం ఆయుధాలు చేపట్టి బ్రిటిష్ వారిని గడగడ లాడిస్తూ, స్వాతంత్ర్య పోరాటంలో తెలుగుజాతిని జాగృతం చేసిన మహనీయులు,అడవిబిడ్డ అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయనకు ఇవే మా ఘన నివాళులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పి కృష్ణ యాదవ్,బిజెపి కిషన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. పాపయ్య, పట్టణ అధ్యక్షులు వివి రమణ, మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు, పట్టణ ఉపాధ్యక్షులు రమణారెడ్డి,పట్టణ కార్యదర్శి ఎన్ గిరీష్,బిజెపి నాయకులు తోట నగేష్ తోట రామయ్య గణేష్ అదృష్ట దీవుడు తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి ముస్లింలకు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: దేశంలో ఉన్న ముస్లిం సమాజానికి ఉగ్రవాదులు అన్న ఉప ము ఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ యావత్ ముస్లీంకి క్షమాపణ చెప్పాలని ము స్లిం ఐక్య వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ శెట్టిగుంట పర్యటన లో భాగంగా సయ్యద్ ఖలీల్ ఎమ్మెల్యేని ప్రశ్నిం చారు. ఒక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ముస్లింలు ఉగ్రవాదులని మాట్లాడడం సరైనది కాదన్నారు.

యోగా ద్వార మానసిక అర్యోగ్యం మెరుగు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు యోగాలో ప్రణాయామంలో అవగహనతో పాటు యోగా ఆసనాలు నేర్పించడం జరిగినది. యోగా మానసిక ఆరోగ్యం మెరుగుపరచడంలో సహాయపడుతుంది, ఇది ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలను తగ్గించగలదు. ఇది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది, ఏకాగ్రతను పెంచుతుంది, మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. అని పిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ శ్రీమతి భారతి గారు విద్యార్థులకు తెలియచేయడం జరిగినది. యోగాలో శ్వాస వ్యాయామాలు (ప్రణాయామం), ధ్యానం వంటివి ఆందోళన స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. యోగాతో మెదడు నిర్మాణం, పనితీరులో మార్పులు తెస్తుంది, ఇది జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది అని ఆమె తెలియజేసారు. అనంతరం మూడ నమ్మకాలు సైన్సులో భాగంగా మేజిక్‌ను చేయడంలో మెలుకువలు నేర్పించడం జరిగినది. ఇందులో ఎలాంటి మాయ-మర్మంలు లేవని బాబాలపేరుతొ అతీంద్ర శక్తులు ఉన్నయి అని ప్రజలను మోసం చేయడం జరుగుతుంది అలాంటి వారి పట్ల ప్రజలు జాగ్రతగా ఉండాలని విద్యార్థులకు మాజిక్ ద్వార తెలియజేయడం జరిగినది.పట్టణంలోని వివిధ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎలిసేట్టి పవన్ కుమార్, లైబ్రేరియన్స్ సుబ్రమణ్యం, జేమ్స్, గ్రంథాలయ సిబ్బంది రమణ, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించిన రిటైర్డ్ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ

విశాలాంధ్ర-కడప వైవీయూ: రిటైర్డ్ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ డా. ఎస్.చెల్లప్ప ఐఎఎస్ బుధవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. పరిశోధన కేంద్రంలోని తాళపత్ర గ్రంథాలను, తామ్రపత్రాన్ని, చేతితో తయారు చేసిన కాగితాలను, బ్రౌన్ రచనలను, మెకంజీ కైఫియత్తులను చూసి డా. ఎస్.చెల్లప్ప హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గతంలో సి.పి.బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించానన్నారు. అప్పటి కన్నా ఇప్పుడు చాలా అభివృద్ధి చెందిందన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడుతున్న విశ్వవిద్యాలయ అధికారులను, సిబ్బందిని అభినందించారు. తమిళనాడులో తెలుగువారి అమూల్య సాహిత్య, చారిత్రక సంపద ఉందని, దానిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అప్పగించమని కోరుతూ 2012లో తాను భారత ప్రభుత్వానికి మరియు తమిళనాడు ప్రభుత్వానికి లేఖ రాశానన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ గట్టి ప్రయత్నం చేసి ఆ అమూల్య సాహిత్య, చారిత్రక సంపదను తెప్పించినట్లైతే తెలుగు పరిశోధకులకు అది చాలా ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, సహాయ పరిశోధకులు డా. భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్. వెంకటరమణ, రిటైర్డ్ తహసీల్దార్లు సఫ్దర్ హుస్సేన్, బాలనాయుడు, గ్రంథాలయ సిబ్బంది బి.హరికృష్ణ, పి.అరుణ కుమారి పాల్గొన్నారు.

అన్నదాత సుఖీ భవ పథకం రైతులకు వరం

అర్హత కలిగిన ప్రతి రైతును గుర్తించి ఈ పథకం లబ్ది పొందేలా పని చేస్తాం

మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి

విశాలాంధ్ర - ముద్దనూరు : మండలంలోని రైతులు అన్నదాత సుఖీ భవ పథకం గురించి ఆయా గ్రామాల్లో రైతుల వివరాలను పునః పరిశీలించి అన్నదాత సుఖీ భవ పోర్టల్ లో రైతుల వివరాలను అప్లోడ్ చేయాలి అని మండల వ్యవసాయ అధికారి రైతు సేవా కేంద్ర సిబ్బందికి సూచించినట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకంనకు అమలు చేయు విధానం అన్నదాత సుఖీ భవ పోర్టల్‌లో రైతుల వివరాలను పరిశీలించి సక్రమంగా ఉన్న వాటిని సిబ్బంది ఏవో లాగిన్ కు ఫార్వర్డ్ చేస్తారన్నారు.తదుపరి మండల వ్యవసాయ అధికారి లాగిన్‌లో రైతుల వివరాలను పరిశీలించి అప్రోవ్ చేస్తారని చెప్పారు.ఏవేని పోర్టల్ లో రైతుల వివరాలు సక్రమంగా లేకపోతే అటువంటి రైతుల వివరాలను తహసీల్దార్ లాగిన్ కు పంపడం జరుగుతుంది అన్నారు.వారు అన్ని వివరాలు నమోదు చేసి తిరిగి అన్నదాత పోర్టల్ కు పంపడం జరుగుతుంది అన్నారు.వాటిని సిబ్బంది పరిశీలించి ఏవో లాగిన్ కు పంపిస్తారు అన్నారు. ఈ పథకం క్రింద మొత్తం 20 వేల రూపాయలు వర్తిస్తుంది అన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా ఆరు వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం వాటా 14 వేల రూపాయలు వర్తిస్తుంది అన్నారు.ఈ మొత్తం మూడు ధపాలుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుంది అన్నారు.

ట్రాక్టర్‌పై వరిగడ్డి దగ్ధం



విశాలాంధ్ర - సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని పీలేరు మార్గమధ్యంలోని అగ్రహారం సమీపంలో ట్రాక్టర్లో అధికంగా వరిగడ్డి వేసుకుని వస్తున్న తరుణంలో విద్యుత్ వైర్లు తగిలి వరిగడ్డి దగ్ధమైనట్లు తెలిపారు. దీంతో స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో మంటలు ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. అయితే ఎటువంటి ప్రాణ నష్టము జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నట్లు అయింది.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి

ఆర్డబ్ల్యూఎస్ డిఈ విజయ్ కుమార్

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్డబ్ల్యూఎస్ డిఈ విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం కావడం వలన తాగునీటి సమస్యలు ఏర్పడితే ప్రజలు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎక్కడైనా పెద్ద సమస్యలు ఏర్పడితే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పైపు లైన్ డ్యామేజ్, బోర్లలో నీటి శాతం తగ్గిపోవడం వంటి సమస్యలు ఏర్పడితే తాత్కాలికంగా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి,ఇంచార్జ్ ఏఈ ఇర్ఫాన్ భాష పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

సుగవాసి సేవలు చిరస్మరణీయం

చైర్మెన్ ముక్కా రూపానందరెడ్డి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : తెలుగు దేశంపార్టీ సీనియర్ నాయకులు మాజీ రాజంపేట పార్లమెంట్ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండరాయుడు సేవలు చిరస్మరణీయం అని కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్, రైల్వేకోడూరు తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి పేర్కొన్నారు.బుధవారం రాయచోటి లోని సుగవాసి నివాసానికి వెళ్లి ఆయన మృతదేహంపై పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఆయన మృతికి సంతాపం వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. పాలకొండరాయుడు కుమారులు సుగవాసి బాలసుబ్రమణ్యం,ప్రసాద్ బాబు లను ఓదార్చి మీకు మేము అండగా ఉంటాం అధైర్యపడవద్దు అని రూపానందరెడ్డి భరోసా ఇచ్చారు. తెలుగుదేశంపార్టీ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, చిట్వేల్ మండలం,రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

విపత్కర పరిస్థితుల్లో రక్షణ కోసమే మాక్ డ్రిల్

ఆర్డీఓ శ్రీనువాసులు, సీఐ కొండారెడ్డి

విశాలాంధ్ర-గాలివీడు: విపత్కర పరిస్థితుల్లో తమతో పాటు తోటివారిని రక్షించడం కోసమే మాక్ డ్రిల్ నిర్వహించినట్లు రాయచోటి ఆర్డీవో శ్రీనువాసులు, లక్కిరెడ్డిపల్లి సీ.ఐ కొండారెడ్డి పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని తూముకుంట గ్రామం సోలార్ పవర్ ప్లాంట్ లో అగ్నిమాపక సిబ్బందితో కలసి మాక్ డ్రిల్ నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భద్రత మరియు అప్రమత్తత కోసమే ఈ మాక్ డ్రిల్ నిర్వహణ యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అంతమాత్రాన ప్రజలు భయపడాల్సిన పనిలేదన్నారు.ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా ప్రవర్తించాలో తెలుసుకోవడం కోసమే అవగాహన కల్పించమన్నారు. అంతేగాక తమ చుట్టూ అనుమానాస్పదంగా ఎవరైనా, ఏమైనా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా భవిష్యత్తులో మరిన్ని మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గాలివీడు తాసీల్ధార్ భాగ్యలత, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె.రాజారెడ్డి, గాలివీడు ఎస్సై రామకృష్ణ, లక్కిరెడ్డిపల్లి ఎస్సై రవీంద్ర,ఆర్.ఐ బాలజీ, పోలీస్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది,108 సిబ్బంది రామాంజులు, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్పద స్థితిలో యువకుడు మృతి

విశాలాంధ్ర -పోరుమామిళ్ల రూరల్ : వైయస్సార్ కడప జిల్లా బి కోడూరు మండల పరిధిలోని మున్నెల్లి పంచాయతీ మున్నెల్లి గ్రామానికి చెందిన పిల్లోబి గాండ్ల మనోజ్ (25) అనుమానస్వద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే. మున్నెల్లి గ్రామానికి చెందిన పిల్లోబిగండ్ల ప్రసాద్. పద్మావతి దంపతుల పెద్ద కుమారుడైన మనోజ్ ఐటిఐ చదివి ఇంటి వద్ద ఉండి ఇండ్లకు కరెంటు వైరింగ్ చేసుకుంటూ ఉండేవాడు. అందులో భాగంగా ఆదివారం ఉదయం ఇంటి నుండి తన బైక్ లో పని కోసం వెళ్తున్నాను అని ఇంటిలో చెప్పి వెళ్లిపోయిన మనోజ్. మంగళవారం రాత్రి లోయర్ సగిలేరు ప్రాజెక్టు వద్ద ముళ్ల పొదల్లో శవమై తేలాడు. మనోజ్ శరీరం కుళ్ళి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గుర్తించి వారి బంధువులకు తెలిపారు. ఈ మేరకు బి కోడూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బి కోడూరు హెడ్ కానిస్టేబుల్ శేఖర్ తెలిపారు.

దళితవాడల్లో అడ్డుగోడలపై ఏఎస్పీ విచారణ

విశాలాంధ్ర-రాజంపేట : దళితువాడల చుట్టూ అగ్రవర్ణాల వారు నిర్మించిన ఎత్తైన అడ్డుగోడల నిర్మాణాలపై బుధవారం ఏ ఎస్ పి మనోజ్ రామ్ నాథ్ హెగ్డే విచారణ చేపట్టారు. కూచివారిపల్లె గ్రామపంచాయతీలోని డిబిఎన్ పల్లె అరుంధతి వాడ, ఊటుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని డిబిఎన్ పల్లె అరుంధతి వాడ గ్రామాల ప్రజలు గత నెల 21వ తేదీన అడ్డుగోడలపై సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవికి ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఏఎస్పీ రామ్నాథ్ హెగ్డే డిబిఎన్ పల్లె లోని ఎగువ అరుంధతి వాడ మరియు దిగువ అరుంధతి వాడల్లో పర్యటించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఇరు గ్రామాల ప్రజలు మాట్లాడుతూ అగ్రవర్ణాల వారు తమ గ్రామాల చుట్టూ ఎత్తైన అడ్డుగోడలు నిర్మించి తమను సామాజిక బహిష్కరణకు గురి చేశారని, అంటరానితనంతో కుల వివక్షకు పాల్పడిన అగ్రవర్ణాల వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి తమ అభివృద్ధికి, ఆత్మగౌరవానికి అడ్డుగా నిలిచిన అడ్డుగోడలను తొలగించాలని ఏ ఎస్ పి కి తెలియజేశారు. సేకరించిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి వారి సూచనలు మేరకు తగు చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ రాజా, ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, పోలీసు సిబ్బంది, ఇరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బి.మఠం ఇన్‌చార్జి తాహసీల్దార్‌గా రాజనర్సింహ నరేంద్ర

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండలంలోని ఇన్చార్జి తహశీల్దార్‌గా వేల్పుల రాజనరసింహ నరేంద్ర బాధ్యతలు చేపట్టారు. బ్రహ్మంగారి మఠం తాహశీల్దార్ దామోదర్ రెడ్డి సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానానికి మైదుకూరు తాహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న రాజనర్సింహ నరేంద్రను ఆయన కు ఇన్చార్జిగా జిల్లా అధికారులు బాధ్యతలు ఇవ్వడం జరిగిందని అయితే ప్రస్తుతం వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురుపూజ మహెూత్సవాలను బాధ్యత కూడా కల్పించారన్నారు. అనంతరం జరుగుతున్న ఉత్సవాలు సిబ్బందితో కలిసి ఏర్పాట్లను పరిరక్షించారు. అనంతరం ఆఫీసులో వారి సిబ్బందితో కలిసి సమావేశాన్ని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహశీల్దార్, జాన్సన్ రీ సర్వే డిప్యూటీ తాహశీల్దార్, సాంబశివారెడ్డి వీఆర్వోలు సర్వేర్లు వీఆర్ఏలతో పాల్గొన్నారు.

కత్తితో వ్యక్తిపై దాడి

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల కేంద్రానికి చెందిన హార్డ్‌వేర్ షాప్ ఓనర్ సురేష్ (తమ్ముడు)పై పోలీస్ లైన్ విధికి చెందిన ఇండియన్ గ్యాస్ డ్రైవర్ ఫరూక్ బస్టాండ్ కూడలిలో బుధవారం కత్తితో దాడి చేసాడు దీంతో బలమైన గాయం కావడంతో ఆసుపత్రికి తరలించుకుంటూ స్థానికులు తెలిపారు. పోలీసుల వివరాలు మేరకు వివాహేతర సంబంధంతో దాడి జరిగినట్లు ఎస్సై ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాల్మీకి జిల్లా నూతన కమిటీని ఏర్పాటు

విశాలాంధ్ర-మదనపల్లె: అన్నమయ్య జిల్లా మదనపల్లిలో వాల్మీకి జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. వాల్మీకి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉత్తరాసి హరికృష్ణ ఉపాధ్యక్షులు చిన్నరాయప్ప ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు వాల్మీకి సంఘ నాయకులు మీడియాతో తెలిపారు. అన్నమయ్య జిల్లా నూతన కమిటీలో అధ్యక్షుడిగా దేవపట్ల సుధాకర్, ఉపాధ్యక్షుడిగా విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా యనమల నవీన్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. మదనపల్లి గ్రామీణ మండలాలలో ఉంటున్న వాల్మీకి సోదరుల సంక్షేమమే ధ్యేయంగా అన్నమయ్య జిల్లా నూతన కమిటీ పని చేస్తుందని ఈ సందర్భంగా రాష్ట్ర వాల్మీకి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉత్తరాషా హరికృష్ణ, గౌరవ ఉపాధ్యక్షుడు చిన్నరాయప్ప, మిద్దింటి రవికిరణ్, రాగి మేకల పల్లి శ్రీనివాసులు, రాష్ట్ర అధికార ప్రతినిధి బొగ్గిటి కృష్ణమూర్తి, నిమ్మనపల్లి హరి, మ,నీ నవీన్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యుద్ధం అనివార్యమైనప్పుడు పరిస్థితులను

ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

విశాలాంధ్ర-రాయచోటి: భారత్ పాకిస్తాన్ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో వెలగపూడి సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, త్రివిధ దళాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వివిధ జిల్లాల కలెక్టర్లను కేంద్ర హెూం శాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన సివిల్ మాక్ డ్రిల్ కార్యక్రమాలపై వివిధ ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. భారత్ పాకిస్తాన్ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో యుద్ధం అనివార్యమైనప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, త్రివిధ దళాలతో సమన్వయం చేసుకొని పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్లకు మరియు ఎస్పీలకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దమనివార్యమైనప్పుడు జిల్లా యంత్రాంగం, జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలని ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖ, తదితర శాఖల వారు తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండి సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు.

వైభవంగా కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-రామసముద్రం: మండల కేంద్రమైన రామసముద్రం బజారు వీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి అమ్మవారికి ఆలయ అర్చకులు శ్రీనివాస ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు అర్చనలు చేశారు వాసవి హెూమం మహా మంగళహారతి తీర్థప్రసాదాలు ఇచ్చారు. భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం ఆర్యవైశ్య వాసవి సేవ దళ్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నరసింహులు గబ్బారి సుదర్శన్ బాబు మధుసూదన్ ఆర్యవైశ్య యువత అధ్యక్షుడు గబ్బారి జయకుమార్ మధుసూదన్ గుప్తా బాలాజీ లక్ష్మీకాంతరాజు హరీష్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-కొండాపురం: మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా వృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జమ్మలమడుగు తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ఎర్కొన్నారు. వెనుకబడిన తరగతులు మరియు అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరంను కొండాపురంలోని లలితా సూపర్ మార్కెట్ ప్రక్కన ప్రారంభం చేశారు. ఈ సంధర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సోదరుడు మండల ఇంచార్జ్ శివనారాయణ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమంలో తప్పకుండా హాజరై టైలరింగ్ నేర్చుకోవాలని సూచించారు. నేర్చుకున్న వారికి శిక్షణ అనంతరం కుట్టు మిషన్ అందజేస్తారని తెలియజేశారు. శిక్షణ అనంతరం ఇక్కడ మహిళలకు ఉపాధి చూపేలా ప్రభుత్వం నుండి ప్రోత్సాహం అందేలా చూస్తామని తెలియజేశారు. అదేవిధంగా మండలంలో గండికోట ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల 22గ్రామాలు ముంపునకు గురికావడం వల్ల ఇక్కడ ఉపాధి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా గతంలో లోకేష్ బాబు యువగళం పాదయాత్ర సంధర్భంగా కూడ నిర్వాసితులు కోరిక మేరకు ఈ ప్రాంతం నందు చిన్న పిరశ్రమ ఏర్పాటుచేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఈ విశయం ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ విశ్వనాథ్ రెడ్డి, చామల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మి ప్రసన్న, సుకన్య, సురేష్ రెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మి నాగ ప్రసాద్, సబ్ ఇన్స్పెక్టర్ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకూడదు

డ్వామా అనుబంధ శాఖల అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : వేసవిలో జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి డ్వామా, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జిల్లాలో చేపడుతున్న వివిధ కాల పనుల పురోగతిపై జేసీ అదితిసింగ్ తో కలిసి... జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి డ్వామా, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సీజన్ లో జిల్లాలో ఎక్కడా నీటికొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పెంపుడు జీవాలకు ఎలాంటి తాగునీటికొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, స్టార్మ్, రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా.. సమీప నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ.. వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుతో మెట్ట భూములను సాగులోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయంలో అంతర్భాగమైన ఉద్యాన, ప్రకృతి సాగు, పాడి, మత్స్య సంపదను గ్రామాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంగా.. ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రధానంగా ఎంపిడివోలు, ఏపీవోలు వారు పనిచేసే మండలాల్లోనే నివాసం ఉంటూ.. ఉద్యోగ విధులను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను ప్రాధాన్యత మేరకు నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది చివరి నాటికి 60 వేల ఎకరాల్లో ఉద్యాన మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఉద్యాన శాఖ అధికారులు, ఏపీఎంఐపి, పీఆర్ అధికారుల సమన్వయంతో ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఎస్సి కార్పొరేషన్ సంస్థ మొదలైన అన్ని అనుబంధ శాఖలు వారి పరిధిలో నిర్వహించాల్సిన బాధ్యతలను సకాలంలో నిర్వహిస్తూ జిల్లాకు కేటాయించిన లక్ష్యం సాధనకు కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి చేసే దిశగా.. ఆయా ప్రాంతాల్లో వనరుల ఆధారంగా ప్రకృతి వ్యవసాయం, అనుబంధ పంటల సాగుకు రైతులు మొగ్గు చూపేలా వారిలో అవగాహన పెంపొందించాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పిడి అదిశేషారెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్.ఈ. ఏడుకొండలు, పీఆర్ ఎస్.ఈ. శ్రీనివాసులు రెడ్డి, ఉద్యాన శాఖ డిడి సుభాషిణి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి డా. శారదమ్మ డ్వామా ఎపిడీలు, ఏపివోలు, ఎంపిడివోలు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని

ఐసెట్ పరీక్ష కేంద్రం వద్ద ధర్నా-ఎబీవీపీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపి) ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎస్సార్ఐటి ఐసెట్ పరీక్ష కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020లో తీసుకువచ్చినటువంటి జీవో నెం.77 ప్రైవేట్ కళాశాలలో పీజీ విద్యను అభ్యసించాలి అనుకునే పేద విద్యార్థుల పాలిట శాపంగా తయారయిందన్నారు. ఆనాడు జీఓ నెం.77 ఆమోదంలోకి వచ్చిన రోజు నుండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏబీవీపీ ఎన్నో ఉద్యమాలను చేసి గత ప్రభుత్వ నాయకులకు నిద్ర లేకుండా చేసిందని, అది అలా ఉంచితే ఎలక్షన్‌కి ముందు నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తాము ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే జీవో నెం.77రద్దు చేస్తామని తాను చేసిన యువగళం పాదయాత్రలో చాలా సార్లు ప్రస్తావించారు. కాగా వారి ప్రభుత్వం వచ్చి 327రోజులు గడిచినా ఇంకా జీఓ నెం.77 గురించి పట్టించుకోకుండా ఐసెట్ పరీక్ష నిర్వహించడం వారికి విధ్యార్థుల మీద ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని అన్నారు. ఈ ఒక్క జీఓ నెం.77రద్దు చేయకుండా ఐసెట్ పరీక్షలు నిర్వహిస్తే ప్రైవేట్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ చదవాలనుకునే పేద విద్యార్థులు అయోమయంలో ఉన్నారని ఏబీవీపి తెలియజేస్తుంది. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శరణ్‌కుమార్, నగర కార్యదర్శి శివ నారాయణ, శ్రవణ్, తరుణ్, సునీల్, సుదర్శణ్, వెంకటేష్, సూర్య, సోహైల్, సంతోష్, ఉమేష్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రం లేకుండా పరిశుభ్రత పాటించాలి

జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి

విశాలాంధ్ర -బ్రహ్మంగారి మఠం : పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయ పరిధిలోని ప్రాంగణాలలో చెత్తాచెదారాన్ని రోడ్లపై మురికినీరు వంటి ఉండకుండా భక్తులకు ఇబ్బంది కలగకుండా పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. అందులో భాగంగానే బ్రహ్మంగారి 332వ ఆరాధన గురుపూజ మహెూత్సవాలు సందర్భంగా వివిధ రాష్ట్రాల నల్లమూలల నుండి భక్తులు వస్తున్నారని మఠం పరిధిలోని అపరిశుభ్రంగా ఉంచకుండా శుభ్రతను భక్తులకు పారిశుద్ధం కలక్కుండా చూడాలని సిబ్బంది ద్వారా ఎక్కడ చూసినా పరిశుభ్రంగా ఉండాలని అధికారులు పారిశుద్ధంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. అంగళ్ళ దుకాణం వద్ద కూడా ప్రత్యేకంగా డస్ట్ బిన్‌లను ఇవ్వడం జరిగిందని చెత్తాచెదారని రోడ్లపై వేయించి భక్తులకు ఇబ్బంది కలిగించకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి ఎంపీడీవో వీర కిషోర్, ఈవోపీఆర్డి సురేష్ బాబు పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జరుగుతున్న బ్రహ్మంగారి ఆరాధన

గురు పూజ మహెూత్సవాలు

దీక్ష బంధనాలంకారోత్సవం

నేడు భక్తుల మధ్య కన్నుల పండగగా రథోత్సవం

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : ప్రముఖ పుణ్యక్షేత్ర మైన వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మంగారి 332వ ఆరాధన గురుపూజ మహెూత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఉదయం నుండి బ్రహ్మంగారి సుప్రభాత సేవలు, నామ సంకీర్తన అభిషేకాలు ప్రత్యేక పూజలతోపాటు మధ్యాహ్నం 12 గంటలకు భక్తుల మధ్య వేద పండితుల మధ్య వైభవంగా బ్రహ్మంగారు గోవింద మాంబను ఉత్సవం దీక్ష బంధనాలంకారోత్సవంని నిర్వహించారు. అదేవిధంగా రాత్రికి ప్రత్యేకంగా హరికథ కాలక్షేపం పలు సాంస్కృతి కార్యక్రమాలు రాత్రికి బ్రహ్మంగారు గోవింద మాంబ ఉత్సవం నరనందిని ఉత్సవం పై ఊరేగింపు కార్యక్రమాన్ని ఆలయ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ, పర్యవేక్షణలో దేవస్థానం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కార్యక్రమాలను చేపడుతున్నారు. అందులో భాగంగానే వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయ దిగవంత మఠాధిపతులు కుటుంబ సభ్యులకు మైలవరం మండలం పెద్ద కొమ్మల గ్రామానికి చెందిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు పసుపుకుంకుమ, పట్టు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కొన్ని తరాల నుండి పెద్ద కొమ్ముల గ్రామం నుండి పసుపు కుంకమ పట్టు వస్త్రాలను మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో వారికి అందజేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నేడు బ్రహ్మంగారి రథోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా భక్తుల మధ్య వైభవంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు అధికంగా పాల్గొని బ్రహ్మంగారు గోవిందమాంబ రథోత్సవంపై స్వామి మాడవీధుల్లో రథంపై ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు చూసే దానికి పెద్ద ఎత్తున పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి బద్వేల్ ఆర్డిఓ చంద్రమోహన్, మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్, జిల్లా అధికారులు, డివిజన్ అధికారులు, మండల స్థాయి అధికారులు ప్రత్యేకంగా వారి విధుల్లో హాజరవుతారు. ఈ కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ అధికారులు పోలీస్ శాఖ అధికారులతో కలిసి రథోత్సవాన్ని విజయవంతంగా కొనసాగే విధంగా ఏర్పాట్లు చేశారు.

ఆర్డీవో చిన్నయ్యకు సన్మానం

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణంలో ఆర్డీవో చిన్నయ్యకు సన్మానం లభించిందది. శాశ్వత రెవెన్యూ డివిజినల్ అధికారిగా నియమించిన నేపథ్యంలో రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్. ఖాసింవలి టిడిపి నాయకుడు గంగాధర్ రెడ్డిలు సత్కరించి అభినందనలు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర - ముద్దనూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల నాయకుడు డా మధుసూదన్ రెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేసారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వేడి గాలుల ప్రభావం నుంచి జాగ్రత్తలు పాటించాలని వరదకిషోర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కార్యాలయం ప్రాంగణంలో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంచేందుకు చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేడి గాలుల తీవ్రతను సిబ్బందికి వివరించి, తీసుకోవలసిన జాగ్రత్తతలను తెలిపారు.కార్యక్రమంలో ఆర్ఐ పెంచల లక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వాసవి మాత జన్మదిన వేడుకలు

అమ్మవారికి 1,16,000/- బంగారు ఆభరణం వితరణ

విశాలాంధ్ర-నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో వైశాఖ శుద్ధ దశమి బుధవారము శ్రీ వాసవి మాత జన్మదిన వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ కు, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకము నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో కొలువు తీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి కేక్ ఏర్పాటు చేసి వేలంపాట నిర్వహించారు.

అమ్మవారికి బంగారు ఆభరణం వితరణ

రాజంపేట వాస్తవ్యులు ఎంబలూరు లక్ష్మీనారాయణ, అమృతమ్మలు 1,16000/- రూపాయల విలువగల బంగారు ఆభరణాన్ని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవికి వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంబలూరు నరసింహారావు, ఆలయ అధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి, ఉపాధ్యక్షులు మాకం వెంకట కుమార్, సెక్రటరీ గెలివి కుమార్, మేడ వెంకట కుమార్, మంచి కంటి నారాయణ, ఎంబలూరు బాబు, ఎంబలూరు అనిల్ కుమార్, మహిళా మండలి అధ్యక్ష, ఉపాధ్యక్షురాలు గెలివి జయలక్ష్మి, చలపాటి మాధవి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కలిచెర్ల విద్యార్ధి మృతి

విశాలాంధ్ర- పెద్దమండ్యం : మండలంలోని కోటకాదా పలి పంచాయతిలో ని సెట్టివారియాలిలో ఉండే వేంకటేషు కుమారుడు వెంకట్రమన అంగళ్ళలొ మిట్స్ కాలేజీలో ఇంజినియరింగ్ చదువు తున్నాడు ప్రతి రోజు మాదిరిగా బైక్ పై అంగల్లు కు కాలేజీ కు వెళ్ళాడు అంగల్లు లో రెండు ద్విచక్ర వాహనాలు డీ కొట్టడంతో క్రింద పడిన ఆతనిని ట్రాక్టర్ అతని మీదుగా వెళ్లడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. పోస్ట్ మార్టం నిమిత్తం మదనపల్లి ఆసుపత్రికి తరలించి పోలీస్‌లు కేసు మోడు చేశారు .మృతుని.స్వగ్రామంలో చదువు కోవడానికి వెళ్లిన కొడుకు మృతి చెందదని తెలియడం తో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

శ్రీ సౌమ్యనాథ స్వామి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఉండిని బుధవారం లెక్కించగా 2,64,921/- రూపాయలు వచ్చినట్లు ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీని నెలరోజుల తర్వాత లెక్కించడం జరిగిందని అన్నారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ఉండి లెక్కింపులో ఆలయ సూపరిండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్ధన, భక్తులు పాల్గొన్నారు అని తెలిపారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

విశాలాంధ్ర-రాయచోటి: రాయచోటి పట్టణం కొత్తపేట నరసింహారెడ్డి నగర్ వీధిలో డ్రైనేజ్ అస్తవ్యస్తంగా ఉండడంతో కొద్దిపాటి వర్షానికి కూడా రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుందని రాయచోటి పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు స్వనజ రెడ్డి తెలిపారు. రాయచోటి పట్టణంలో బుధవారం కురిసిన స్వల్ప వర్షానికి రోడ్లన్నీ డ్రైనేజ్ మురుగు నీటితో ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో పూ డిపోయాయి. ఎన్నికల సమయంలో నాయకులు ఇక్కడ ప్రజలకు హామీలు ఇవ్వడం గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్షం వెలిసిన తర్వాత కూడా రోడ్లపై ఒకటి రెండు రోజులు బురద ఉండడం వాహనదారులకు పాదచారులకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు తక్షణం స్పందించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

లేబర్ కోడ్లను రద్దు కోరుతూ మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ సీఐటియు కేంద్ర కార్మిక సంఘాలు -కనీస వేతనం 26 వేలు చేయాలని డిమాండ్

విశాలాంధ్ర-కడప రూరల్ : మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కడప జిల్లాలో జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశం ఏఐటియుసీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగసుబ్బారెడ్డి, సీఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్‌లు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో చర్చలేకుండా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలుకై చేస్తున్న తీవ్ర ప్రయత్నాలను అడ్డుకునేందుకు భారత దేశంలోని యావత్ కార్మికవర్గం మే20న సమ్మె చేయడం ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 13 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ సార్వత్రిక సమ్మె ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం ధరలకు అనుగుణంగా 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తుందని తెలిపారు. కార్మిక చట్టాలు బలంగా ఉన్నప్పుకు కూడా కార్మికులకు అరకొరగా మాత్రమే న్యాయం జరిగేవని, ఇప్పుడు 44 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్స్ తీసుకురావడంతో కార్పొరేటు యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలు చేయడంతో కార్మికులు బానిసల కంటే దారుణమైన పరిస్థితుల్లోకి నెట్టబడతారని హెచ్చరించారు. హైర్ ఫైర్, ఫిక్సిడ్ టర్మ్ ఎంప్లాయ్మెంట్, అప్రెంటీస్ విధానాల ద్వారా కార్మికుల శ్రమ దోపిడీని కార్పొరేట్ యాజమాన్యాలకు దోచి పెట్టేందుకే మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోట్లు తీసుకువచ్చిందని గుర్తు చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే యాజమాన్యాలపై విధించే శిక్షలను తొలగించి, రాజ్యాంగబద్ధంగా పోరాడే కార్మికులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా చట్టాలను మార్పులు చేయడాన్నీ కార్పొరేట్ పెట్టుబడిదారుల లాభలకోసమేనని విమర్శించారు. పెట్టుబడిదారి ఆర్థిక సంక్షోభాన్ని సామాన్య ప్రజలపై, కార్మికులపై బలవంతంగా రుద్దేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను మే 20 సమ్మెలో కార్మికులు సంఘాలతో నిమిత్తం లేకుండా భారీగా పాల్గొనడం ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మే10 వ తేదీ లోపు యాజమాన్యాలకు, అధికారులకు సమ్మె నోటీసులు అందించాలని, మే11వ తేదీన జిల్లా విస్తృత సమ్మె సదస్సును, మే15న రౌండ్ టేబుల్ సమావేశం మే17,18 స్కూటర్ ర్యాలీలు నిర్వహించాలని అన్ని నియోజవర్గ కేంద్రాల్లో మండలాల్లో సదస్సులను పూర్తిచేయాలని, కరపత్రాలు ద్వారా. కార్మికుల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని కార్యాచరణ ప్రకటించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్,కే.శ్రీనివాసులురెడ్డి,ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా ఏఐటీయూసీ సీఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు పి. సుబ్బరాయుడు యు.మద్దిలేటి, చంద్రారెడ్డి వెంకటసుబ్బయ్య,ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి తారక రామారావు ఉపాధ్యక్షుడు మేలింగి రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజల భద్రత కోసం మాక్ డ్రిల్

విశాలాంధ్ర-రాయచోటి: జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు బుధవారం గాలివీడు మండలం, తూముకుంట గ్రామంలోని టాటా పవర్ రెన్యవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (సోలార్ కంపెనీ)లో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ నిర్వహించిన అనంతరం ఎస్పీ ప్రజలకు ముఖ్యమైన సందేశం ఇచ్చారు. ప్రజల భద్రత, అప్రమత్తత కోసమే ఈ మాక్ డ్రిల్ నిర్వహించామని ఆయన తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రజలకు అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మాక్ డ్రిల్స్ మరిన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ప్రజల యొక్క భద్రత శ్రేయస్సు కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోలార్ కంపెనీ మేనేజర్ రవీంద్ర జోషి, రాయచోటి ఆర్డిఓ ఏ.శ్రీనివాస్, గాలివీడు ఎమ్మార్వో భాగ్యలత, లక్కిరెడ్డిపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ టీవీ కొండారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె.రాజారెడ్డి, గాలివీడు ఎస్ఐ రామకృష్ణ, లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్ర, లక్కిరెడ్డిపల్లి సర్కిల్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు, ఫైర్ అధికారులు సిబ్బంది, మెడికల్ సిబ్బంది. సోలార్ కంపెనీ సిబ్బంది. హోంగార్డులు పాల్గొన్నారు.

నారా లోకేష్ కు స్వాగతం పలికిన ఛైర్మెన్ కెకె

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : సత్యవేడు నియోజకవర్గంలో అభివృద్ధికి పునాదులు వేయడానికి విచ్చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి కమ్యూనికేషన్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు కు బుధవారం రేణిగుంట విమానాశ్రయం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాది మరియు గ్రామీణ పరిశ్రమల శాఖ ఛైర్మన్ కస్తూరి కోటేశ్వరచౌదరి (కెకె) పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు.అదేవిదంగా తిరుపతి జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ కు,జోనల్ ఇంచార్జి దీపక్ రెడ్డి కి, ఉమ్మడి చిత్తూరు జిల్లా శాసనసభ్యులతో కలసి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కెకె మంత్రి బృందంతో కలిసి పర్యటించారు.

నజీరుల్లాషా మసీదు ఏర్పాటు చేసాం



విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: నజీరుల్లాషా కోరిక మేరకు మసీదును ఏర్పాటు చేయడమే కాకుండా, షాదిఖానా కూడ నిర్మించడం జరిగిందని నజీరుల్లాషా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం మైదుకూరు రోడ్డులోని నజీరుల్లాషా షాదిఖానాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు, అడ్వకేట్ దాదాపీర్, జీలానీ బాష, షామీర్ బాషా, బొల్లవరం బాషా, ఇక్బాల్ బాషా, ఇనాయతుల్లా తదితరులు పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేశారు. 1944లో నజీరుల్లాషా సాహెబ్ వీలునామా రాశారు. స్వయంగా కమిటీ ఏర్పాటుచేసి కుమారులను, శిశ్యులను కమిటీలో చేర్చి ఆస్తి విక్రయం చేయకూడదని వీలునామాలో రాశారని తెలిపారు. కుమారులకు, కుమార్తెలకు ఆస్థిలో ఎటువంటి సంబంధం లేదని 1976లో రిజిష్టర్ చేశారన్నారు. ఆయన కోరిక మేరకు ఈ ప్రాంతంలో మసీదు, షాదీఖానా నిర్మించామన్నారు. షాదీఖానా నిర్మాణానికి ముక్తియార్ దాదాపు 30లక్షల విరాళం ఇచ్చారని అన్నారు. 1945లో దొంగ డాక్యుమెంట్ తయారు చేసి క్లెయిం చేశారని హైకోర్టు కూడ ఫోర్జరీ డాక్యుమెంట్ అని తెచ్చిందని అన్నారు. ఇప్పటికే పిటిషన్లు వేసి దొంగ డాక్యుమెంట్లను ఒరిజినల్ డాక్యుమెంట్లుగా రుజువు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 2023లో రిట్ పిటిషన్ వేసి బిడ్డలుగా తమకు హక్కు ఉందని ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని అంటున్నారన్నారు. 87ఆఫ్ 2000లో సూట్ ఫైల్ చేశారు. అప్పీల్ చేసిన కోర్టు డిస్మిస్ చేసిందన్నారు. వీరి ఉద్దేశం కోట్ల రూపాయలు ఆస్థులు కొట్టివేయాలనే దురుద్దేశ్యం అన్నారు. ఇందులో ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదన్నారు. తప్పుడు ప్రచారాన్ని ప్రజలలోకి తీసుకువెళ్తున్నారన్నారు. సమాజ హితం కోసం, నజీరుల్లాషా ఆస్థులు పరిరక్షణ కోసం మా కమిటీ పని చేస్తుందని అన్నారు.

ప్రజల్లో విస్తృత అవగాహన పెంచుతున్నాం

- రైల్వేస్టేషన్ లో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్
- కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: దేశంలో పౌర రక్షణ - ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా.. చేపడుతున్న సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ కార్యక్రమాలపై జిల్లా ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర రాజధాని నుండి.. రాష్ట్రంలో పౌర రక్షణ - ముందస్తు భద్రతా చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర డిఫెన్స్ సంస్థల అధిలారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విసి ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితిసింగ్, కెఎంసి కమీషనర్ మనోజ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. సీఎం విసి ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం ఉ.11 గం. లకు బాకరాపేట హెచ్పీసీఎల్ లో, సా. 4 గం. లకు కడప రైల్వేస్టేషన్ లో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. మాక్ డ్రిల్ సమయంలో.. ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. సివిల్ డిఫెన్స్ రూల్స్ ప్రకారం జిల్లాలో పౌర రక్షణ మాక్ డ్రిల్, రిహార్సల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, ఫైర్, మెడికల్, మొదలైన ఎమర్జెన్సీ సర్వీసులు, ఇతర అధికారులు భాగస్వామ్యం కావాలని, అందుకు సంబంధించిన ఎస్.ఓ.పి. ప్రకారం కార్యక్రమాలను నిర్వహించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. మాక్ డ్రిల్ నిర్వహణపై రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు వారి పరిధిలోని మండలాల్లో పౌర రక్షణ ముందస్తు చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ కార్యక్రమంలో.. జిల్లా యంత్రాంగం, వివిధ జిల్లా అధికారులు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు/వాలంటీర్లు, హోమ్ గార్డ్ (యాక్టివ్/రిజర్వ్స్ట్) వాలంటీర్లు), ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, ఎన్వైకెలు, కళాశాల/పాఠశాల విద్యార్థుల చురుకుగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్వో శ్రీనివాసరావు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-రాయచోటి: మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వ్రరి సురేష్ కుమార్ లు కోరారు. మే 20వ తేదీన చేపట్టే సార్వత్రిక సమ్మె నోటీసు మంగళవారం మున్సిపల్ కమిషనర్ కు అందజేశారు. ఈ సందర్భంగా మాటాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 35వేలు అమలు చేయాలని, మున్సిపల్ వర్కర్స్ న్యాయమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించి మున్సిపల్, పారిశుధ్యం, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. పారిశుద్య కార్మికులకు నూనె, సోపులు చెప్పులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప, కేశవరావు, వెంకటేష్ ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యం

- డిడిఆర్ఎఫ్ అనిల్ కుమార్

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: ముందస్తు అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలను నివారించడానికి సాధ్యం అవుతుందని అన్నమయ్య జిల్లా డిడిఆర్ఎఫ్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మంగంపేట మైన్స్ వద్ద డిడిఆర్ఎఫ్ అద్వర్యంలో రాజంపేట, రైల్వేకోడూరు ఫైర్ సిబ్బంది సంయుక్తంగా అగ్నిప్రమాదాల నివారణ పట్ల ఎపిఎండిసి ఎంప్లాయిస్ కు, కార్మికులకు జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో మంటలను ఆర్పే విధానాన్ని (మాక్ డ్రిల్) అగ్నిమాపక సిబ్బంది ప్రత్యక్షంగా చూపించారు. అగ్ని ప్రమాదాల నుండి ప్రాణాలతో ఎలా బయట పడాలి, బావులలో, చెరువులలో, కుంటలలో చిన్నపిల్లలు ఈత కు వెళ్లె సమయంలో తీసుకోవాల్సిన పలు కీలక మైన అంశాలపై కార్మికులలో చైతన్యం తీసుకువచ్చారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కాపాడుతున్నామన్నారు. ఈ సదస్సులో ఎపిఎండిసి ఛీఫ్ ప్రాజెక్టు ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, మైన్స్ మేనేజర్ గోపినాథ్, మెకానికల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కుడుముల చలపతిరెడ్డి, రాజంపేట ఫైర్ ఆఫీసర్ మాబుసుభాన్, ఎంప్లాయిస్, కార్మికులు, రైల్వే కోడూరు ఫైర్ సిబ్బంది వెంకటసుబ్బయ్య, శేషయ్య, ప్రదీప్ కుమార్, నవీన్ కుమార్, వెంకటేష్ రాజు, సురేష్, పవన్ కుమార్ రెడ్డి, గురు మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిలారెడ్డి నాయకత్వంపై కూటమి ప్రభుత్వం గుబులు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పై ప్రశ్నల వర్షం కురిపిస్తూ ఆ ప్రభుత్వ వైఫల్యాన్ని నిలదీస్తున్న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వై.యస్ .షర్మిలారెడ్డి నాయకత్వం, ఆమె పనితీరును చూసి కూటమి ప్రభుత్వం లో గుబులు పుట్టుకుందని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ స్పష్టం చేశారు. ఇటీవల జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కాంగ్రెస్ పార్టీ, పిసిసి అధ్యక్షురాలు వై.యస్. షర్మిల రెడ్డి పై చేసిన ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుందని తెలిపారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుటుంబానికి రాజకీయ జీవితం ప్రసాదించిన పార్టీగా కాంగ్రెస్ పార్టీకి కడప జిల్లాలో పేరుందని స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే కుటుంబానికి రాజకీయ జీవితం ప్రసాదించారని గుర్తు చేశారు. అలాంటి పార్టీ తుడిచిపెట్టుకుపోవాలని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పిసిసి అధ్యక్షురాలు వై.యస్. షర్మిలారెడ్డిని ఆరోపిస్తూ ఆమెను గాంధారిగా, ఎమ్మెల్యే మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ పై పెరుగుతున్న ప్రజల ఆదరణను ఎవరు ఆపలేరన్నారు. నిన్న మొన్న పుట్టిన పుట్టగొడుగులు లాంటి పార్టీలు కాంగ్రెస్ పార్టీని ఏమీ చేయలేవని హితవు పలికారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు చిన్న కులయప్ప, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కమల్ బాషా, పార్టీ నేత లు హమీద్, గౌరీ దేవి పాల్గొన్నారు.

నోబుల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్‌కు జెవివి ఘన నివాళి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలోచనలు శాస్త్రీయ అవలంబన, మానవతా దృక్కోణాలకు మార్గదర్శకమని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక జిల్లా గ్రంథాలయంలో మే 7వ తేదీన జాతీయ గీత రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షులు సమీర్ బాష మాట్లాడుతూ ఠాగూర్ రచనలు మనకు మానవత్వాన్ని, ప్రేమను విశ్వశాంతిని బోధిస్తాయని, ఆయన జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఆయన రాసిన జాతీయ గీతం "జనగణమన" దేశ సమైక్యతను చాటి చెప్పే గీతం అని, 1913లో ఆయనకు' గీతాంజలి' అనే ఆంగ్లానువాద కవితా సంపుటికి గాను నోబెల్ బహుమతి కూడా లభించిందని పేర్కొన్నారు. బ్రిటీష్ వాళ్ళు ఇచ్చిన' నైట్' అనే బిరుదును జలియన్ వాలాబాగ్ హత్యాకాండ తరువాత తన నిరసనను తెలుపుతూ దాన్ని తిరస్కరించడం ఠాగూర్ విలువలకు అద్దం పడుతుందని జెవివి నగర ఉపాధ్యక్షులు రాయల్ కరిముల్లా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ సిబ్బంది పవన్, బాబ్జి, సుబ్రహ్మణ్యం, శేఖర్, రమణ, సుబ్బమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు పాలకొండ్రాయుడు

- మాజీ ఎంఎల్ఏ వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శ శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటి: ప్రజానాయకుడు సుగవాసి పాలకొండ్రాయుడు అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం పాలకొండ్రాయుడు పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి మృతి పట్ల సంతాపం తెలిపి వారి కుమారులు సుగవాసి బాల సుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్ బాబులను పరామర్శించారు. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పాలకొండ్రాయుడు రాజకీయ జీవితంలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారన్నారు. నాలుగు పర్యాయాలు ఎంఎల్ఏగా, ఒక పర్యాయం ఎంపీగా పనిచేసిన పాలకొండ్రాయుడు మృతి నియోజకవర్గానికి తీరనిలోటన్నారు. నిరం తరం ప్రజాశ్రేయస్సుకే పాటుపడ్డారని, ప్రజల హృదయాలలో శాశ్వితంగా నిలిచారన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, కౌన్సిలర్లు, కొలిమి చాన్ బాష, ఫయాజ్ అహమ్మద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్ర యాదవ్, అఫ్రఫ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సాదక్ అలీ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, తబ్రేజ్ ఖాన్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిది విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్‌కు ఘనంగా వీడ్కోలు

- వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి

విశాలాంధ్ర-కడప: ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల రిమ్స్ ప్రిన్సిపల్ గా పనిచేస్తూ నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ గా బదిలీపై వెళుతున్న డాక్టర్ ఏ. సురేఖకు బుధవారం అక్కడి అధికారులు, డాక్టర్లు గణంగా వీడ్కోలు పలికారు. 2022 అక్టోబర్‌లో పూర్తి అదనపు బాధ్యతలతో రిమ్స్ ప్రిన్సిపల్‌గా విధుల్లో చేరిన డాక్టర్ ఎ.సురేఖ 2023 సెప్టెంబర్ నుంచి అడిషనల్ డిఎంఈ హోదాలో ప్రిన్సిపల్‌గా సమర్థవంతంగా విధులను నిర్వహించారు. ఆమెబదిలీ పై వెళ్ళనుండడంతో ఆ స్థానంలో ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా, అడిషనల్ డీఎం హోదాలో పనిచేస్తున్న డాక్టర్ టి. జమునను కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ గా నియమితులయ్యారు. బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. సురేఖకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య కళాశాల ప్రిన్సిపల్ గా ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రంలో ముఖ్యతిథులుగా డిప్యూటీ కలెక్టర్ రంగ స్వామి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.వి రమాదేవి,

సిఎస్ఆర్ఎమ్ ఓ డాక్టర్ వై. శ్రీనివాసులు, పాల్గొన్నారు. రిమ్స్ వైద్యులు, వైద్య విద్యార్థులు మరియు వైద్య సిబ్బంది అందరు కలిసి శాలువా కప్పి, పూల బొకే తో ఘనంగా సన్మానించి గణ వీడ్కోలు పలికారు. ఈకార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీ సుశీల, మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగ శ్రీలత, సర్జరీ విభాగం విభాగాధిపతి డాక్టర్ వాణి, జిజిహెచ్ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.శ్రీనివాసరావు, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్, రిమ్స్ శానిటేషన్ మరియు సెక్యూరిటి కాంట్రాక్టర్ బాలనారాయణ రెడ్డి, రిమ్స్ వైద్యులు, వైద్య సిబ్బంది వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.